క్లుప్తంగా

ఉద్యోగులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం



ఎంపీడీఓ రాణెమ్మకు వినతి పత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

సి.బెళగల్: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేదిలేదని మండల గ్రామ సచివాలయ ఉద్యోగుల సంఘం సభ్యులు హెచ్చరించారు. విశాఖ కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి సచివాలయ ఉద్యోగులపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మండల సచివాలయ ఉద్యోగులు శుక్రవారం నిరసన తెలిపారు. విశాఖ కార్పొరేటర్‌పై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రాణెమ్మకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు సేవలు అందిస్తున్న సచివాలయ ఉద్యోగులను చులకన చేసి మాట్లాడటం సమంజసం కాదని, అలాంటి వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

3న సావిత్రీబాయి జయంతి

పాణ్యం: జనవరి 3వ తేదీన సావిత్రీబాయి, షేక్ ఫాతిమా జయంతి వేడుకలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్‌యూఐ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిన ప్రతాప్ పిలుపునిచ్చారు. ఈ మేరకు వేడుకలకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో కలిసి ఆయన విడుదల చేశారు. మహిళల సమాన హక్కుల సాధనకు వారు చేసిన పోరాటాలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలి



మాట్లాడుతున్న నరేంద్రనాథ్‌రెడ్డి

పాణ్యం: సాగునీటి సంఘాల ఎన్నికలను శనివారం పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పాణ్యం రెవెన్యూ కార్యాలయంలో ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించకుండా విధులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సమయపాలన పాటించాలన్నారు. ఏమైన సమస్యలుంటే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

శిక్షణపై ఆసక్తి చూపని అధికారయంత్రాంగం



శిక్షణకు నామమాత్రంగా హాజరైన అధికారులు, ప్రజా ప్రతినిధులు

సి.బెళగల్: అధికారులు, సర్పంచ్‌లకు స్థానికీకరణ స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై ఇస్తున్న శిక్షణపై అధికారయంత్రాంగం ఆసక్తి చూపడం లేదు. మండల కేంద్రం సి.బెళగల్ మండల పరిషత్ కార్యాలయంలో రెండవ రోజు శుక్రవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి వివిధ శాఖల మండల అధికారులు, అన్ని గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు, కొన్ని శాఖల సచివాయల ఉద్యోగులకు హాజరు కావాల్సి ఉంది. చాలా మంది ఉద్యోగులు, సర్పంచ్‌లు ఆసక్తి చూపలేదు. అయితే శిక్షణ కార్యక్రమానికి గైర్హాజరు అయిన అధికారులకు మండల పరిషత్ కార్యాలయ ఏఓ శ్రీనివాసులు ఫోన్ చేసి పిలవాల్సి వచ్చింది. ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాల్సిన శిక్షణ 10:48 గంటల అనంతరం ప్రారంభం అయ్యింది. మధ్యాహ్నం జిల్లా పంచాయతీ రీసోర్స్ సెంటర్ డీటీఎం గిద్దేశ్వర్లు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాణెమ్మ, ఈఓఆర్డీ ఈశ్వరయ్య స్వామి, పీఆర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈలు వెంకటప్రకాష్, గోసేనాయక్, ఏఈఓ రామన్న, ఏపీఎం రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గోకులాల షెడ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గంగాద్రి

కల్లూరు: గోకులాల షెడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలని క్వాలిటీ కంట్రోల్ అధికారులు విజయ భాస్కర్, గంగాద్రి సూచించారు. శుక్రవారం కల్లూరు మండలం ఎ.గోకులపాడు గ్రామంలో ఎమ్మిగనూరు, కర్నూలు క్లస్టర్‌లలో పని చేస్తున్న ఉపాధి హామి పథకం సాంకేతిక సహాయులు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీ గోకులం షెడ్లను నిర్దేశించిన కొలతల ప్రకారం నిర్మించాలన్నారు. పశువుల సంఖ్యకు అనుగుణంగా షెడ్డు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీలు లక్ష్మన్న, కృష్ణ మోహన్, సీఎల్ఆర్‌సీ కోర్స్ డైరెక్టర్లు ఎర్రమల, సురేష్, జీఐఎస్ కోఆర్డినేటర్లు యశోధ రావు, ఏపీవోలు మద్దేశ్వరమ్మ, రమాదేవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకిచ్చిన హామీలు ఏమయ్యాయి బాబూ?



ధర్నా చౌక్ నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మేయర్ బీవై రామయ్య, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, మాజీ ఎమ్మెల్యేలు



ర్యాలీలో ఎడ్లబండిపై వస్తున్న మేయర్ బీవై రామయ్య, నాయకులు

- రైతు సమస్యలపై వైఎస్సార్‌సీపీ పోరు బాట విజయవంతం
- భారీగా తరలివచ్చిన రైతులు, మహిళలు, ప్రజలు
- ఎద్దుల బండి తోలుతూ ప్రత్యేక ఆకర్షణగా నగర మేయర్ బీవై రామయ్య
- నగరంలోని ధర్నా చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ

కర్నూలు (టౌన్): ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలు ఎమయ్యాయని వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులు సీఎం చంద్రబాబును ప్రశ్నించారు. రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ కర్నూలు నగరంలో శుక్రవారం రైతులు, మహిళలు, ప్రజలు రోడ్డెక్కారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. నగరంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ' కార్యక్రమానికి శుక్రవారం మంచి స్పందన వచ్చింది. భారీగా రైతులు, మహిళలు, ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చారు. ఉదయం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపించింది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి పెద్దఎత్తున రైతులు, ప్రజలు తరలివచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నగరంలోని గౌరీగోపాల్ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ధర్నా చౌక్ వద్దకు చేరుకున్న రైతులు, పార్టీ శ్రేణులు సూపర్ సిక్స్ పేరుతో కూటమి ప్రభుత్వం ప్రకటించిన హామీలను వెంటనే నెరవేర్చాలని ప్లకార్డులు ప్రదర్శించారు. జిల్లాలో తీవ్రంగా నష్టపోయిన టమాట, మిరప, వరి, పత్తి మొక్కలను ర్యాలీలో ప్రదర్శించారు. రైతు కండువాలు కప్పుకున్న పార్టీ శ్రేణులు, చిరంజీవి అభిమానుల సంఘం నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. ధర్నా చౌక్ నుంచి కర్నూలు వైద్య కళాశాల, బుధవార పేట, ప్రభుత్వ ఆసుపత్రి, కలెక్టరేట్ వరకు పెద్ద సంఖ్యలో కాలినడకన తరలివచ్చారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. రైతుల వ్యతిరేకి చంద్రబాబు డౌన్ డౌన్, మోసాలతో రాష్ట్రాన్ని ఏలే అర్హత చంద్రబాబుకు లేదంటూ ర్యాలీలో నినాదాలు చేశారు.

ఎడ్ల బండిపై మేయర్, సుభాష్

రైతు సమస్యలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా శుక్రవారం చేపట్టిన నిరసన ర్యాలీలో కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్థానిక ధర్నా చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన ర్యాలీలో ఎడ్లబండి తోలుతూ పాల్గొన్నారు. మేయర్, అలాగే నాగలితో సుభాష్ చంద్రబోస్ ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది.

'అన్నదాత సుఖీభవ' అమలుచేసే వరకు పోరాటం

ఎన్నికల ముందు అన్నదాత సుఖీభవ పేరుతో ప్రతి రైతును ఆదుకుంటామని ప్రకటించిన చంద్రబాబు ఈ పథకం అమలుచేసే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని పార్టీ నేతలు ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం అర్హత ఉన్న ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో పెద్ద సంఖ్యలో తరలివచ్చిన రైతులను చూసైనా ప్రభుత్వం వెంటనే పథకాన్ని అమలు చేయాలన్నారు. జిల్లాలో పత్తి రైతులు, టమాటా, మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మోసం చేసి అధికారంలోకి వచ్చిన చంద్రబాబుకు వ్యతిరేకంగా అడుగడుగునా ప్రజల పక్షాన నిలిచి పోరాటం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వంపై ఆరునెలలకే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని చెప్పారు. సూపర్ సిక్స్ హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగులకు భృతి ఇంకెప్పుడు ఇస్తారని నేతలు ప్రశ్నించారు. పార్టీ నాయకులు షరీఫ్, ఆదిమోహన్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, ధనుంజయ ఆచారి, విక్రమ సింహారెడ్డి, జుబేర్, యూనుస్ బాషా, కృష్ణకాంతరెడ్డి, శ్రీనివాసరావు, నాగలక్ష్మిరెడ్డి, వి.అరుణ, లక్ష్మీకాంత రెడ్డి, సుదర్శన్ రెడ్డి, మునెమ్మ, బెల్లం మహేశ్వర రెడ్డి, రెడ్డి పోగు ప్రశాంత్ కిషన్, రైల్వే ప్రసాద్, నాగవేణిరెడ్డి, రాజేష్, గద్ద రాజశేఖర్, చిరంజీవి అభిమానుల సంఘం నాయకులు శివయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ర్యాలీలోని కీలకాంశాలు

- భుజంపై చెర్నకోలతో ర్యాలీలో పాల్గొన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియా వ్యక్తులను వేధిస్తే చర్నకోలకు పనిపెడతా అనడంతో పార్టీ శ్రేణులు చప్పట్లతో హోరెత్తించారు.
- ర్యాలీలో వైఎస్సార్‌సీపీ జెండాలు రెపరెపలాడాయి.
- ఉదయం 11 గంటలకే గౌరీగోపాల్ సర్కిల్ మొత్తం రైతులు, మహిళలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో నిండిపోయింది. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పోలీసులు మళ్లించారు.
- కార్యకర్తలు అంబులెన్స్‌కు దారి వదిలి ముందుకు పంపించారు.
- నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, పార్టీ నేతలు రైతు కండువాలు ధరించి ఆకర్షణగా కనిపించారు.
- అమరావతి పాలన తప్పా.. ఇతర ప్రాంతాల అభివృద్ధి పట్టదా అని బుట్టా రేణుక ప్రశ్నించడంతో పార్టీ శ్రేణులు చప్పట్లు కొడుతూ హర్షధ్వానాలు చేశారు.

రోడ్డుపైకి సాగునీరు !



కంబదహాల్ దగ్గర రోడ్డుపై మొకాటిలోతు గుంతలలో నిలిచిన నీరు

సి.బెళగల్: మండల పరిధిలోని కంబదహాల్ గ్రామం దగ్గర ప్రధాన రోడ్డుపై శుక్రవారం సాగునీరు చేరింది. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పొలానికి సాగునీరు అధికం వదలడంతో కట్టలుతెగి రోడ్డుపైకి పెద్ద ఎత్తున నీరు చేరింది. రోడ్డుపై ఉన్న మొకాటిలోతు గోతులు నీటితో నిండిపోయాయి. దీంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. సి.బెళగల్ నుంచి ఎమ్మిగనూరుకు పత్తి లోడ్‌తో వెళ్తున్న ఆటో రోడ్డుపై గోతిలో పడాపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అయితే సాగునీరు రోడ్డుపైకి వదలడంపై కుట్రకోణం ఉందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది ఉద్దేశ పూర్వకంగా పొలాల నీటిని రోడ్డుపైకి వచ్చేలా రాత్రి వేళలలో వదిలి సదరు రైతులపై చర్యలు తీసుకునేలా వ్యవహరించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నీటిని రోడ్డుపై వదిలిన కుట్రదారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు పోలీసులను కోరుతున్నారు.



అదుపుతప్పి పడిపోయిన పత్తిలోడ్ ఆటో

కూటమి ప్రభుత్వంలో రైతులకు అన్యాయం



అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ కార్యక్రమంలో పాల్గొన్న కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్



గడివేముల: నంద్యాలకు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

కోడుమూరు రూరల్ : అన్నదాతల సమస్యలపై శుక్రవారం కర్నూలులో నిర్వహించిన అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ కార్యక్రమానికి కోడుమూరు నియోజకవర్గం నుంచి రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా.ఆదిమూలపు సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో కోడుమూరు, గూడూరు, కర్నూలు, సి.బెళగల్ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. కూటమి సర్కార్‌కు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినా దాలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు మౌలాలి, ప్రసన్నకుమార్, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మండల కన్వీనర్లు రమేష్‌నాయుడు, సోమశేఖర్‌రెడ్డి, ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

నంద్యాలకు తరలివెళ్లిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

గడివేముల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రైతులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని జెడ్పీటీసీ సభ్యుడు ఆర్బీ చంద్రశేఖర రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం నంద్యాల కలెక్టరేట్ ఎదుట శుక్రవారం నిర్వహించిన అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ ధర్నాకు మండలం నుంచి రైతులు,కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించేందుకే వైఎస్సార్‌సీపీ నిరసన వ్యక్తం చేసేందుకు పిలుపునిచ్చిందన్నారు. ప్రతి రైతుకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు మంజూరు చేస్తామని చెప్పిన సీఎం ఇంత వరకు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగమద్దమ్మ,వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్లారెడ్డి,అనిల్‌కుమార్ రెడ్డి,మేఘనాధరెడ్డి,నాగేశ్వరరెడ్డి,బాలచెన్ని,చంద్రశేఖరరెడ్డి,పుల్లయ్య,రమేష్, కృష్ణారెడ్డి,నాగేశ్వరరెడ్డి,వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులపై దాడి అమానుషం



డిప్యూటి తహసీల్దార్ శివశంకర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న పాణ్యం జర్నలిస్టులు



తహసీల్దార్‌కు వినతి పత్రమిస్తున్న జర్నలిస్టులు

పాణ్యం: కడప జిల్లా వేముల మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో సాక్షి జర్నలిస్టులు శ్రీనివాసరావు, కెమెరామెన్ రాముపై జరిగిన దాడిని ఖండిస్తూ పాణ్యం జర్నలిస్టులు శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సంఘం సభ్యులు మాట్లాడుతూ సమాచార సేకరణ కోసం వెళ్లిన పాత్రికేయుల్లపై అధికారపార్టీ నాయకులు దాడి చేయడం సిగ్గు చేటన్నారు. అధికారులు సమక్షంలో దాడి చేయడం జర్నలిస్టులకు రక్షణ లేదని అర్థమవుతుందన్నారు. జర్నలిస్టులపై దాడి అమానుషమన్నారు. కార్యక్రమంలో పాణ్యం జర్నలిస్టులు బాలకంబయ్య, రమేష్, శ్రీనివాసులు, నబీ, రవి, కరుణాకర్, జావీదు తదితరులు పాల్గొన్నారు.

సి.బెళగల్: విలేకరుల దాడులు చేసేవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల విలేకర్లు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. వైఎస్సార్ కడప జిల్లాలో సాక్షి రిపోర్టరుపై దుండగులు దాడిని ఖండిస్తూ మండల విలేకర్లు శుక్రవారం నిరసన తెలిపారు. అదేవిధంగా తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చి, ఈ మేరకు సమస్యలను తెలిపారు. కార్యక్రమంలో విలేకర్లు భాస్కర్, గోవిందు, మహేష్ తదితరులు ఉన్నారు.

దుండగులపై చర్యలు తీసుకోవాలి

కల్లూరు: కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం, వేముల మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి కవరేజీకి వెళ్లిన సాక్షి రిపోర్టర్‌లపై అధికార పార్టీ నాయకుల దాడిని విలేకరులు ఖండించారు. ఈ మేరకు దాడికి పాల్పడిన దుండగులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులుకు విలేకరులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కల్లూరు మండల రిపోర్టర్లు బి.వై. శ్రీనివాసులు, విజయ్ కుమార్, నాగరాజు, ఆర్.బి. శ్రీనివాసులు, శ్యామ్ కుమార్, దేవరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోడుమూరు రూరల్: విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గూడూరు సబ్ డివిజన్ డీఈఈ జేసన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ గూడూరు, బురాన్‌దొడ్డి, పులకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ఫీడర్లలో మరమ్మతులు, గూడూరు, సి.బెళగల కోడుమూరు సబ్‌స్టేషన్లలో మెయింటనెన్స్ చేపడుతున్నందున మూడు మండలాల పరిధిలో కరెంట్ కోతలు ఉంటాయన్నారు. వినియోగదారులు సహకరించాలని డీఈఈ కోరారు.

సి.బెళగల్: మండలం పరిధిలోని గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సుకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 సబ్ స్టేషన్లలో నిర్వహణ, మరత్తుల నేపథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. సి.బెళగల్‌తో పాటు పోలకల్, గుండ్రేవుల, కొత్తకోట, బురాన్‌దొడ్డి విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో విద్యుత్ సరఫారా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆరోగ్య సూత్రాలు పాటించండి

గడివేముల: ప్రతిఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని శాంతిరాం ప్రముఖ మానసిక వ్యాధుల వైద్యురాలు డాక్టర్ ఓంకారం సింధుజ తెలిపారు. జిందాల్ సిమెంట్ యూనిట్ హెడ్ నవనీత్ చౌహాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మానసిక ఆరోగ్య ప్రాముఖ్యతను వివరించారు. ఉద్యోగులు ఆందోళన చెందకూడదని, ప్రశాంతతను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్‌ఓలు కిషోర్‌బాబు, వైవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలి



విద్యుత్ బిల్లులు చూపుతున్న సీపీఎం నాయకులు

కల్లూరు: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కె.మధు డిమాండ్ చేశారు. శుక్రవారం ఉలిందకొండ గ్రామంలో పెంచిన విద్యుత్ చార్జీలపై సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులు దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోని రాకముందు కూటమి పెద్దలు విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలలో రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం వేసిందన్నారు. అలాగే ప్రజల అభిప్రాయం తీసుకోకుండా బలవంతంగా స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాజు, మోహన్, పాండురంగడు, మధు తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: కూటమి ప్రభుత్వం అమాంతంగా పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని నన్నూరు గ్రామంలో నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం నన్నూరు శాఖ కార్యదర్శి మధుసూదన్, సీఐటీయు మండల అధ్యక్షులు షాజాహాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో నాగన్న మాట్లాడారు. విద్యుత్ చార్జీలు తగ్గించకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించంఆరు. కార్యక్రమంలో పార్టీ సభ్యులు మల్లేష్, మాసూం బాష, సలాంబాష, దస్తగిరి, ఎర్రమల, ఆకుల మధు, ఇస్మాయిల్, శాలుమియ్య తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్ఓ భాస్కర్



రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

కల్లూరు: వాతావరణ మార్పులతో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమతంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ భాస్కర్ అన్నారు. శుక్రవారం బస్తిపాడు గ్రామంలో నిర్వహిస్తున్న వైద్య సేవలను ఆయన పరిశీలించారు. ఓపికి వచ్చిన ప్రజలతో అక్కడ అందుతున్న సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రజలందరికీ ఆరోగ్య సేవలు అందించాలన్నారు. రక్త పరీక్షలు చేసి అవసరమైన మందులు అందించాలని వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉండాని, ఫ్రైడే డ్రై డే క్యాక్రమాన్ని ప్రతి శుక్రవారం నిర్వహించాలని ఆదేశించారు. డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, ఫైలేరియా తదితర వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం హెల్త్ సెంటరలో రిజిస్టర్లను, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో కల్లూరు పీహెచ్‌సీ వైద్యులు మోతీలాల్ నాయక్, ఎఎన్ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారమే లక్ష్యం



పులకుర్తిలో రైతుల అర్జీలను పరిశీలిస్తున్న కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్



వినతులు స్వీకరిస్తున్న స్పెషల్ ఆఫీసర్ వెంకటేశులు

కోడుమూరు రూరల్: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్ తెలిపారు. మండలంలోని పులకుర్తి గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ వెంకటేష్ నాయక్ నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆర్డీఓ హాజరయ్యారు. రైతుల నుంచి వినతతులు స్వీకరించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ రైతులు ఇచ్చినటువంటి అర్జీలన్నింటిని పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సదస్సులో అందజేసిన ప్రతి వినతికి పరిష్కారం చూపాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓ రవి ప్రకాష్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

సి.బెళగల్: మండల పరిధిలోని గుండ్రేవుల గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి వినతలు స్వీకరించారు. వివిధ భూ సమస్యలపై 16 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈఓ సీతరామిరెడ్డి, మండల సర్వేయర్ నాగభూషణం, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, వీఆర్వోలు రామ్మోహన్ రెడ్డి, గౌరి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని పసుపల గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ వెంకట లక్ష్మీ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సుకు కోడుమూరు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ బి.వెంకటేశులు హాజరయ్యారు. రైతుల నుంచి వినతులు స్వీకరించారు. భూ సమస్యపై వినతులు సమర్పించి సమస్యలను పరిష్కరించుకోవాలని ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ రైతులకు సూచించారు. వివిధ భూ సమస్యలపై 10 అర్జీలు అందాయని తహసీల్దార్ తెలిపారు.

మీ పిల్లలకు ఇలాంటి...అన్నం పెడతారా ?



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆంజనేయులు

కల్లూరు: మీ పిల్లలకు ఇలానే అన్నం పెడతారా అంటూ కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు సీరియస్ అయ్యారు. మండల పరిధిలోని దూపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. పిల్లలకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యత లేకపోవడంతో అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు, వంట నిర్వహకులపై తహసీల్దార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ పిల్లలకు ఇలానే ఆహారాన్ని అందిస్తారా అంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలకు అందించే మధ్యాహ్న భోజనంపై రాజకీయాలు ఎంటని వంట నిర్వహకులు, ఉపాధ్యాయులపై మండిపడ్డారు. పాఠశాలలో విద్యార్థులకు తప్పనిసరిగా ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పాఠశాలలో రిజిస్టర్లను, రికార్డులను పరిశీలించారు.